# మహామాయ

ఆనాడు మహారాజావారి ఆజ్ఞానుసారం నగర ప్రతీహారుని సేవకులు, అవధూత స్వాములైన అఘోరభైరవులను, ఆర్య వేంకటేశపాదులను దేశమునుండి బహిష్కరించే సంకల్పముతో నావపై ఎక్కించుకొని ఎచ్చటికో గొంపోయినారనే వార్త స్థానేశ్వర ప్రజలలో ఆగ్రహావేశాలను రెచ్చగొట్టింది.

దుర్దమనీయమైన మ్లేచ్ఛుల సేన హిమాలయ పర్వత మార్గాలను దాటి వచ్చేటందుకు ప్రయత్నిస్తున్న ఆ సమయములో ప్రజలు ప్రభువులయెడ అసంతుష్టులైనట్లయితే సర్వనాశనం తప్పదనే ఉద్దేశ్యంతో ఆచార్య భర్వుపాదులు ఒక లేఖను ప్రకటించేరు. శ్రీ హర్షవర్ధన మహారాజుగారిచే గౌరవింపబడే గొప్ప బౌద్ధ పండితులు ఆచార్య భర్వుపాదులు.

ఆనాటి సాయంత్రం స్థానేశ్వరంలో ప్రఖ్యాతి చెందిన ఓ భజన మంటపంవద్ద బ్రహ్మాండమైన ప్రజా సభ యేర్పాటు చెయ్యబడింది. సభలోవున్న అందరి ముఖాలలోనూ ఆవేశం స్పష్టంగా గోచరిస్తోంది. అయినప్పటికీ సభంతా స్తబ్ధమై శాంతంగావుంది. సభాధ్యక్షులవారి ఆజ్ఞానుసారంగా ప్రముఖులంతా ఒకరి తరువాతొకరు తమ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేరు.

చర్చ ముగిసింది. పిమ్మట సభాధ్యక్షులవారు లేచి గంభీరమైన కంఠముతో "ఆచార్య భర్ద్వపాదులు పంపిన లేఖ లోని సారాంశం మీకు తెలియనిదికాదు! ... ఇటువంటి క్లిష్ట సమయంలో రాజ్య తంత్రానికి ఏవిధమైన విఘాతం సంభ వించకుండా చూడవలసిన బాధ్యత మనమీద వుంది. ఈ చర్య ప్రజలలో సంక్షోభాన్ని రేకెత్తించడానికి హేతువు అయిందనే విషయాన్ని మహారాజా వారికి వినయపూర్వకంగా మనవిచేసి న్యాయాన్ని ప్రసాదించమని ప్రార్థించేటందుకై ప్రముఖులైన కొంతమంది ధర్మశాస్త్రపారంగతులను పంపించ డం ఉచితమైన పద్ధతని యీ సభలోవున్న విజ్ఞానులు నిర్ణ యించారు. ఈ క్లిష్టసమయంలో దేశంలోవున్న ప్రజలంతా పరిపాలకులతో సహకరించకపోతే దేశం యావత్తూ సర్వ నాశ నం అవుతుందనే ఆచార్య భర్ద్వపాదుల హెచ్చరిక నిర్లక్ష్యం చెయ్యవలసినదికాదు! ... ఈ సమయంలో మనం ఆవేశానికి లోనయినట్లయితే అది మనందరి వినాశనానికి దారితీస్తుంది. మీ అందరి అనుమతికోసం యీ నిర్ణయం మీ ముందుంచ బడింది! మీ అభిప్రాయాన్ని తెలియజెయ్యండి." అని పలికి ఊరుకున్నారు.

అంతట క్రోధారుణమైన ముఖంతో ధూసర కాషాయ వస్త్రాంబర ధారిణి అయిన మహామాయ, అరుణ భాస్కరుని నుండి వెలువడిన ఓ దివ్య తేజస్సులాగ ఒక మూలనుండి ఆ సభా వేదికమీదికి ప్రవేశించింది.

ఆ సభలో కొన్ని విషయాలు మాట్లాడేందుకు తన కవకాశ మిమ్మని అధ్యక్షులవారిని ప్రార్థించిందామె! అనుజ్ఞ నిచ్చారు అధ్యక్షులవారు.

మహామాయ శక్తినంతా కూడగట్టుకొని బిగ్గరగా "ఆర్య సభాసదులందరికీ నమస్సులు! ... నేను అవధూత స్వాములగు అఘోర భైరవుల శిష్యురాలను! ... నా పేరు మహామాయ. బౌద్ధుడైన రాజు పరిపాలనలో రాజాస్థాన బౌద్ధ భిక్షువైన వసుభూతి కుట్రవల్ల మా గురువుగారి కీనాడు యీ అవమానం జరిగింది. ఇందుకు నేను చింతించడంలేదు. అవధూత స్వాములవారు మానావమానాల కతీతులు. వారు సాక్షాత్తూ శివ స్వరూపులు. అయితే ఈ సందర్భంలో మహారాజుని ప్రార్థించాలని ఈ సభవారు చేసిన తీర్మానాన్ని నేనాక్షేపిస్తు న్నాను! ... సరే! ... మా గురువుగారి విషయము అలా గుంచండి. నేను సన్యాసిని. చావంటే నాకు భయంలేదు. నన్ను మహా తేలిగ్గా మహారాజు చంపించగలడు. కాని సత్యాన్ని చెప్పనివ్వకుండా అతనీనాడు నన్నాపలేడు! ... ఆచార్య భర్వు పాదుల లేఖ మన పౌరుష హీనత్వాన్ని బహిరంగంగా ప్రచా రం చేసేటందుకు ఉపకరిస్తుంది. అంతేకాదు; భారత దేశపు భావి పరాజయానికికూడా అది తోడ్పడుతుంది! ...

"ఉత్తరాపథంలోవున్న వృద్ధులు, స్త్రీలు, బాల బాలి కలు ప్రతాపశాలి అయిన రాజుయొక్క శక్తిని ఆశ్రయించక పోతే జీవించలేరనే ఆచార్య భర్వుపాదుల అభిప్రాయముతో

మీరూ ఏకీభవిస్తారా? మన యువకులు ఏఁవీ చేతకాని వట్టి పిరికిపందలా?... స్వతంత్రంగా ఆలోచించే శక్తి ఈ దేశంలో వున్న ప్రముఖ పురుషులలో లోపించిందా? ... ఈ దేశపు రాజుల యింద్రియలిప్స మితిమీరిపోయింది! ... వారి అంతః పురాలు అపహరించి తెచ్చిన కన్యల ఆక్రందనాలచే ప్రతిధ్వనిస్తున్నాయి! ... నేనెవరినో తెలుసా? ... ఈ దేశంలో అవమానింపబడి, నిందింపబడి, అకారణముగా దండింపబడిన అనేకమంది యువతీమణులలో నేనొకతెను! ఇటువంటి నీచమైన వ్యాపారాలకు రాజ్యాంతఃపురాలు, సామంతుల భవనాలు ప్రధానాశ్రయాలన్న సంగతి మీ అందరికీ తెలిసిన విషయమే! ...

భోగలాలసతకు లోనైన ఈ రాజుల సహాయము అపేక్షించడం అవివేకం. మహారాజుగారు మీ ప్రార్థనను మన్నించకపోతే మీరేంచెయ్యగలరు? ... శ్రీ హర్షవర్ధన మహారాజుగారు గొప్ప శీలవంతులు, గుణవంతులు అని నేనూ ఒప్పుకుంటాను. కాని కన్యల నపహరించడమే తమ ప్రతాపముగా భావించే అనేకమంది సామంతులకు రాజతంత్రమనే నెపంతో వారాశ్రయ మిచ్చారన్న సంగతి మీకు తెలియనిది కాదు. ఇంద్రియ భోగాలకు, అవినీతికి వశులైన సామంతుల సహాయముతో వారిక సాధించగలిగే దేముంది? అంచేత వారిపై ఆశ వదిలిపెట్టండి. మీరంతా ఏకీభవించి మ్లేచ్ఛుల సేనల నెదిరించండి.

"మన పవిత్ర హిమాలయాల సరిహద్దులలో శత్రువుల సేనావాహినులు సమీకరించబడుతున్నాయి. అప్రమత్తులై యుండండి. చరిత్ర నేర్పిన గుణ పాఠాలను మరచిపోకండి! భోగలాలసులైన ఈ రాజులను నమ్ముకొని దేశ రక్షణ భారాన్ని వారికి విడిచిపెట్టడం మహా ప్రమాదకరం! అంచేత పౌరుషవంతులైన ఓ వీర యువకులారా! మీలో మీకున్న క్షుద్రమైన వైషమ్యాలను విస్మరించి దేశ రక్షణ కోసం అందరూ ఏకమై పెనుగాలివలె చెలరేగండి! ... చావుకి భయ పడకండి. మృత్యు భయమే మాయ! ... మృత్యు భయమే మాయ" అని చెప్పి మహా మాయ సభ నంతటినీ కలయ జూసింది. ఆమె అరుణారుణ నేత్రాలలోంచి విస్ఫులింగాలు రాలుతున్నాయి!

కొన్ని వందల కంఠము లొకేసారి "మృత్యు భయమే మాయ!" అని దిక్కులు పిక్కటిల్లేటట్లు నినదించేయి.

అంతకంతకు ప్రజల సంఖ్య అధికమవసాగింది. సభాస్థలి చాలలేదు. ఆ ప్రాంతమంతా జనులతో కిక్కిరిసిపోయింది.

"మృత్యు భయమే మాయ" అను ఉద్రేకపూరితమగు నినాదములు దుర్భేద్యములైన స్థానేశ్వరపు ప్రాకారములను దాటి నలు దిశలా వ్యాపించసాగేయి.

మహామాయయొక్క ఈ ఉపన్యాసాన్ని ప్రజలు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయేరు! ... త్రిశూలధారిణి అయిన ఆది

శక్తి మహామాయ రూపంలో సాక్షాత్కరించి భోగలాలసు లైన పరిపాలకులను నాశనం చేయమని ఆజ్ఞాపించినట్లు ఒక పుకారు ప్రజలలో వ్యాపించింది.

ప్రజలు తలొక రకంగా దీని కర్థం చెప్పుకుంటూండడం సభాధ్యక్షులవారు గమనించేరు. ఆవేశపరులైన ప్రజలవల్ల అవాంఛనీయమైన ఏమనర్థం సంభవిస్తుందోననే భయం వారి నావహించింది. మహామాయవేపు ఆందోళనగా చూస్తూ "మీరు చెప్పినది సత్యంకాదని నేననను! ... కాని ఆవేశ పూరితులై యున్న ఈ ప్రజలు మీ భావాలను సరిగ్గా అర్థం చేసుకొనే స్థితిలో ప్రస్తుతంలేరు. ఈ క్లిష్ట సమయంలో ప్రభు శక్తిని ధిక్కరించి విప్లవ జ్వాలలను రేకెత్తించినట్లయితే తిరిగి క్రమబద్ధం చెయ్యడం బహుకష్టం. ఇదే అదనుగా భావించి మ్లేచ్ఛుల సేన యీ దేశాన్ని సర్వనాశన మొనరిస్తుంది. ఇలాంటి సమయంలో ప్రజలలో బుద్ధివైకల్యం గావించడం మంచి పనికాదు! ... ఈ ప్రజా సమూహాన్ని యెలాగైనా మీరే శాంతింపజెయ్యాలి." అన్నారు.

మహామాయ కొద్ది క్షణాలసేపు ఆలోచించి శక్తినంతా కూడగట్టుకుని బిగ్గరగా "ఓ వీరులారా! ... శాంతించండి! శాంతించండి!" అని అఱచేసరికి ప్రజలంతా సమ్మోహితులై నట్లుగా శాంతులై మహామాయవేపు చూసేరు. తరువాత మహామాయ "ప్రియమైన సోదరులారా! ... ఈ నగరములో వున్న విద్యావంతులు మహారాజావారి నీవిషయమై ప్రార్థించా

లనుకుంటున్నారు. పోనీ వారికీనాడి అవకాశాన్నియివ్వండి!” అని పలికి మెరపు తీగలా వెడలిపోయింది.

అక్కడున్న ప్రజలందరూ దిగ్భ్రమ చెందేరు.

కొద్ది నిముషాల తరువాత అఘోరభైరవులను, ఆర్య వేంకటేశపాదులను తిరిగి నగరానికి తీసుకొచ్చి వారికి సంపూర్ణ స్వేచ్ఛ నొసంగినారనే రాజ ప్రకటన వెలువడింది!...

అయితే ఈ మహామాయ ఎవరు?

ఆమె అసలు విషయాన్ని విడిచిపెట్టి అప్రస్తుత విషయం గురించి అంత ఆవేశంతో ఎందుకుపన్యసించింది?

ఈ దేశంలో ఆమె ఎవరిచే ఏ విధంగా అవమానింపబడి నిందింపబడి, దండింపబడింది?

ఈ ప్రశ్నకు సమాధానాలు అచ్చట గుమిగూడిన సామాన్య జను లెవ్వరికీ తెలియవు!... స్థానేశ్వర రాజ వంశానికి ఆంతరంగికు లనదగు బహు కొద్దిమందికి మాత్రమే తెలుసు!...

♦ ♦ ♦

సుప్రసిద్ధ మౌఖరీ వంశపు రాజులలో ఒకడైన గృహవర్మ కన్యాకుబ్జ దేశమును పరిపాలిస్తున్న కాలమది. చుట్టు ప్రక్కలనున్న అనేక మంది రాజులు అతని ప్రతాపాగ్నికి తట్టుకోలేక లోబడిపోయేరు. అలా లోబడిపోయినవారిలో

ఉలూంత రాజొకడు. అతడు చాలా మోసగాడు! ... అరి వీర భయంకరుడైన గృహావర్మతో ఎలాగైనా బంధుత్వాన్ని ఏర్పరచుకొని తన పలుకుబడిని పెంపొందింప జేసుకోవాలనే బుద్ధి పుట్టిందతనికి! ... తన కుమార్తెను గృహావర్మకిచ్చి వివాహం జరిపించాలనుకున్నాడు. తీరా ఆ ప్రయత్నంలో అత నుండగా అతని కుమార్తె అకస్మాత్తుగా హృద్రోగంవల్ల మరణించింది. ఉలూంతరాజు గుండె దిటవు చేసుకొని యీ మరణ వార్త యే విధంగానూ బయటకు పొక్కనివ్వకుండా అతి నేర్పుగా ఆమె మృత శరీరానికి అంత్య క్రియలను జరి పించాడు. ఆ తరువాత రూప రేఖాదులలో తన కుమార్తెను పోలివున్న యువతికోసం అన్వేషణ ప్రారంభించేడు. అతని దృక్పథంలో మహామాయ పడింది.

అపహరణ అతి నేర్పుగా జరిగింది!

అంతఃపురములో బంధింపబడింది.

అతి సామాన్య కుటుంబంలో జన్మించిన మహామాయ ఆకస్మికంగా ఒక రాజ కుమార్తెగా రూపొందింది.

తలవని తలంపుగా లభ్యమైన ఆ మహాభాగ్యం మహా మాయకు రవ్వంతైనా ఆనందాన్నివ్వలేదు!

కన్నీరు మున్నీరుగా విలపించసాగింది. ఆమెను ఓదార్చే టందు కెవ్వరూ ప్రయత్నించలేదు. పైపెచ్చు ఉలూంతరాజు ఒక వికటాట్టహాసం చేసి "మూర్ఖురాలా! ... ఏడు పెందుకే? నువ్విప్పుడు యీ ఉలూంతరాజు కుమార్తెవే!" అన్నాడు.

మహామాయ ఆతని పాదాలను ప్రక్షాళనచేస్తూ "ప్రభూ! దయార్ద్ర హృదయులైన తాము యీ దీనురాలి ప్రార్థనను మన్నించి వదిలిపెట్టండి ప్రభూ!" అని యెంతో దీనంగా ప్రార్థించింది.

"దౌర్భాగ్యురాలా!... నీకు మహారాణీయోగము పట్టనున్నదే!... ఈ అదృష్టయోగాన్ని కాలదన్నేవా నీ బ్రతుకు ఘోర నరకంలోకి నెట్టివేయబడుతుంది."

"నా ప్రియుడితోసహా నన్ను నరకంలోకి నెట్టివేసినా నా కానందమే!"

ఉలూతరాజు వికటాట్టహాసం చేసేడు. పాదాల వద్దనున్న మహామాయను ప్రక్కకు నెట్టి 'ప్రియుడా? ... ఎవడే ఆ ప్రియుడు?" అని అడిగేడు.

'వారు ... వారు... ఆనందవర్మగారి పెద్ద కుమారులు!'

'వాడా?' అని ఉలూతరాజు హేళనగా నవ్వేడు.

'అవును ప్రభూ!... మా వివాహానికి నా తల్లిదండ్రులు, వారి తల్లిదండ్రులు సంతోషంతో అంగీకరించేరు. ముహూర్తంకూడా నిశ్చయించేరు. వారు నన్ను హృదయపూర్వకంగా ప్రేమించారు. నా హృదయాన్ని వారికేనాడో సమర్పించు కున్నాను. ఇలా మమ్మల్ని ... ... ... " అని మహామాయ అంటూండగా ...

వెటకారంగా నవ్వుతూ "పాపం!... అయితే ఇప్పుడు నీలో హృదయం లేదన్నమాట! అయినా ఫరవాలేదులే! గృహవర్మ మహారాజుగారు వారి హృదయాన్ని నీ కిస్తారులే! మహారాణీయోగం ఎంతో అదృష్టవంతులకుగాని పట్టదు! ఈ యోగాన్ని కాలదన్నడానికి ప్రయత్నించేవంటే నువ్వు ఎవడికైతే నీ హృదయాన్ని సమర్పించేవో వాడుమాత్రం యీ లోకంలో వుండడు! జాగ్రిత్త!" అని వెళ్ళిపోబోయి ఆగి "నిన్ను గృహవర్మ మహారాజుగారికిచ్చి వివాహము చెయ్యాడానికి అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. వివాహము అయిపోయాక యే పరిస్థితులలోనైనా నువ్వు నా కూతురివి కాదనే సత్యాన్ని వెల్లడిచేసినట్లయితే ముందు నీ ప్రియుడి తల ఎగిరిపోవడంమాత్రం ఖాయం! జాగ్రత్త!"అని హెచ్చరించి మరీ వెళ్ళిపోయేడు ఉలూతరాజు.

◆ ◆ ◆

క్షత్రియ కులోచితమైన సాంప్రదాయాన్ని అనుసరించి గృహవర్మ మహామాయల వివాహమును అతివైభవముగా జరిపించేడు ఉలూతరాజు.

మోహపరవశుడై యున్న గృహవర్మ శోభనంనాటి రాత్రి మహామాయను తన కౌగలిలోనికి తీసుకోబోయేసరికి ఆమె కాస్త ప్రక్కకు తప్పుకొని అశ్రుపూరిత నయనాలతో

అతని పాదాలవేపు చూస్తూ "ప్రభూ! నైతికంగా నేను మీ భార్యనే! కానీ ... ..." ఆమె నోరు మరి విడివడలేదు.

గృహవర్మ ప్రశ్నార్థకంగా ఆమెవేపు చూచుచూ "నీకేమీ భయంలేదు. చెప్పదల్చుకున్నదేదో అది నిస్సంకోచంగా చెప్పు?" అన్నాడు.

ఆమె ధైర్యాన్నంతా కూడగట్టుకొని కంపిత స్వరంతో "ప్రభూ! ఈ దౌర్భాగ్యురాలి శరీరం మాత్రం తమ వశమయింది. కాని నా హృదయము, మనస్సు యిదివరకే ఒక నిర్భాగ్యుడి అధీనమయేయి!" అందామె.

గృహవర్మ నిశ్చేష్టుడయేడు. కాస్త కోపోద్రిక్తుడవక పోలేదు! అయినా ఎలాగో నిభాయించుకొని "అయితే నీ యిష్టానికి వ్యతిరేకంగా యీ వివాహం జరిగిందన్నమాట!" అని అన్నాడు.

"అవును ప్రభూ! ... తమ బంధుత్వాన్ని ఆశించి ఉలూతరాజుగారు నా యిష్టానికి వ్యతిరేకంగా ఈ వివాహం జరిపించేరు. నాతో సంభవించిన యీ ఎడబాటుకు వారెంతో దుఃఖించి సన్యసించేరని, ప్రస్తుతం ధూమ్రగిరిపై నిశ్చల తపోనిష్ఠాగరిష్ఠులై యున్నారని యివేళే తెలిసింది నాకు. వారిని సర్వదా కాపాడమని ఆ పరమేశ్వరుని ప్రార్థించడం వినా నాకు రెండో ధ్యాసే ఇక ఈ ప్రపంచంలో లేదు!" అని మహామాయ స్పష్టంగా తెలియజేసింది.

ఆ కఠోరమైన సత్యాన్ని తెలుసుకొని గృహవర్మ నిర్ఘాంతపోయేడు. ఆమె మానసికంగా ఎంత తీవ్రంగా విలపిస్తున్నదో అర్థం చేసుకున్నాడు!... కాని ఆమెపై అతనికి మోహం మాత్రం పోలేదు. ఎప్పటికైనా ఆమె గతాన్ని విస్మరించి తన పట్ల ప్రసన్నురాలౌతుందేమోనని అతని ఆశ! ... ఆమెపట్ల అనుచితంగా ప్రవర్తించకుండా ఆమె అభీష్టాని కనుగుణంగా సంచరిస్తే యెప్పటికైనా ఆమె తన ఔదార్యాన్ని గుర్తించి ప్రేమిస్తుందని అభిప్రాయపడ్డాడు.

* ♦ ♦ ♦ *

రాజ దంపతులు పరస్పరం అన్యోన్యంగా లేరనే వదంతి ఆ రాచ నగరిలో వ్యాపించింది.

ఈ రకమైన వదంతి వ్యాపించడానికి కారణం లేకపోలేదు! ... గృహవర్మ మహామాయ అంతఃపురానికి ఎప్పుడొచ్చినా కొద్ది నిముషాలకంటే ఎక్కువసేపు యెప్పుడూ ఉండలేదు. తిరిగి వచ్చేటప్పుడల్లా అవ్యక్తమైన బాధ అతని ముఖంలో గోచరిస్తుండేది. ఏదో ఘర్షణ లోలోన జరుగుతున్నట్లుగా కొంతమంది అంతఃపుర దాసీలు భావించడంవలన యీ రకమైన వదంతి వ్యాపించింది.

అంతఃపురానికి గృహవర్మ యెప్పుడొచ్చినా అత్యంత భక్తి శ్రద్ధలతో గౌరవించి ఉచితరీతిని మర్యాదచేసేది మహా

మాయ! ... అయితే ఆ వుభయుల మనస్సులలోనూ అవ్యక్తమైన మనో వేదన దాగివున్నదనే సత్యం ఒప్పుకోక తప్పదు.

తనలో అంతకంతకు ప్రజ్వలమవుతున్న మోహాగ్ని జ్వాలలను బలవంతంగా చల్లార్చుకోనేందుకు గృహవర్మ ప్రయత్నించేవాడే కాని అనుచితంగా అమానుషంగా యెన్నడూ ప్రవర్తించేవాడు కాదు.

మహామాయ తరచుగా కటిక ఉపవాసాలు చేస్తూ శరీరాన్ని శుష్కింపజేసుకుంటూ సర్వదా త్రిపురసుందరీ దేవి ధ్యానంలోనే నిమగ్నురాలై యుండేది.

ఒకనాటి రాత్రి మహామాయ మిక్కిలి అశుభదాయకమైన కలకన్నది! ... వేయి పడగల నాగుబాము మౌఖరీ రాజ్యలక్ష్మిని కాటు వేసినట్టు స్వప్నంలో ఆమె కగుపడింది. అంతేకాదు! ... ఎముకలు మాత్రమే మిగిలిన తన ప్రియుడు ధూమ్రగిరిపై నుండి "మహామాయా! మహామాయా!" అని ఎలుగెత్తి తనను పిలుస్తున్నట్లు – "మహారాజుతో నీ సంబంధాన్ని తెగ త్రెంపులు చేసుకోకపోయినట్లయితే మహారాజుగారికి సర్వ నాశనం తప్పదు!" అని ఎవరో హెచ్చరించినట్లు కలగన్నది.

కల చెదిరిపోయినా – ధూమ్రగిరిపై నుండి "మహామాయా! మహామాయా!" అనే పిలుపు ఆమె శ్రవణేంద్రియాలను తాకుతూనే వుంది. తానింకా ఆ అంతఃపురంలోనే

ఉంటే తప్పకుండా అశుభం వాటిల్లుతుందనుకుంది. అయితే తన వంశ గౌరవ మర్యాదలు చరిత్రలో కలుషితం కాకుండా ఉండాలంటే తానేవిధంగా మహారాజుతో తన సంబంధాన్ని తెంచుకోవడం? ... ఆమె సుదీర్ఘంగా ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చింది.

ఆ వెంటనే ఆమె కాషాయాంబరాలను ధరించింది! ఒక చేత కుంకుమ పూసిన త్రిశూలం, వేరొకచేత నల్లని పాత్ర ధరించి చండీదేవిలాగ భీకరమైన వేషంతో అంతఃపుర కంచుకి అయిన వాభ్రవ్యుని ఎదుటకు వెళ్ళింది మహామాయ.

ఆ వేషంలోవున్న మహారాణిని చూసేసరికి ఆశ్చర్యం, దుఃఖం, జిజ్ఞాస మొదలయినవన్నీ వాభ్రవ్యునికి కలిగేయి.

ఆమె శిరోజాలు విరియబోయబడి పిక్కలవరకూ వ్రేలాడుతున్నాయి. ఆమె నేత్రాలలోంచి క్షీణమైన కాంతి వెలువడుతున్నది.

వాభ్రవ్యుడు అమితమైన ఆందోళనతో "తల్లీ! మీ యీ వేషం చూస్తుంటే నా హృదయం దహించుకుపోతున్నది. ఈ వైపరీత్యానికి కారణమేమిటమ్మా?" అని అడిగేడు.

"ఆర్య వాభ్రివ్యా! ... త్రిపురసుందరీ దేవి ఆజ్ఞ అయింది. నా మనస్సు యీ అంతఃపురాన్ని దాటిపోయింది. మహారాజుగారు అనుమతించినట్లయితే నేనీ అంతఃపురాన్ని విడిచిపెట్టేస్తాను. ఇక నేనీ గృహస్థధర్మాన్ని పాటించలేను.

మహామాయ సన్యాసం స్వీకరించిందని మహారాజుగారికి మనవి చెయ్యి!" అంది మహామాయ నిశ్చలంగా.

"తల్లీ! ... సౌఖ్యవంతమైన యీ జీవితాన్ని విడిచిపెట్టి దుఃఖ క్లేశభూయిష్టమైన జీవిత పథంలోకి పోవాలనే కఠోర నిర్ణయానికి తామేలవచ్చేరో నాకవగతమవలేదు. తమకేఁవీ అభ్యంతరంలేకపోతే తమ యీ కఠోరమైన నిర్ణయానికి హేతు వేమిటో తెలుసుకోవాలని యీ వృద్ధ కంచుకి హృదయం ఆరాటపడుతున్నదమ్మా! ఒక వేళ మహారాజుగారు దేవిగారి మర్యాదకు భిన్నంగా నడచుకున్నారా?" అని వినయ విధేయ తలతో అడిగేడు వాభ్రవ్యుడు.

మహామాయ ప్రశాంత వదనంతో "మహారాజావారు నా మర్యాదకు భిన్నంగా ఏనాడూ ప్రవర్తించలేదు! మౌఖరీ వంశానికి అశుభాన్ని సూచించే కల ఒకటి కన్నాను" అని కొంచెంసేపు మౌనముగా ఊరుకొని తరువాత తన స్వప్న వృత్తాంతమంతా తెలియజేసింది.

అంతావిని వాభ్రవ్యుడు నిశ్చేష్టుడయేడు. అశ్రుపూరిత నయనాలతో మహామాయవేపు చూస్తూ "తల్లీ! ... తమ ఆజ్ఞానుసారం యిప్పుడే యీ విషయాన్ని మహారాజుగారికి తెలియజేస్తాను." అని చెప్పి వెళ్ళిపోయేడు.

వాభ్రవ్యుడు యీ సమాచారాన్ని మహారాజుగారికి తెలియజేసేడు. గ్రహవర్మ మిక్కిలి ఆందోళనతో అంతః

పురానికేతెంచి సన్యాసిని వేషాన్ని ధరించివున్న మహామాయను చూసి నిర్ఘాంతపోయేడు. "దేవీ ఏమిటీ వైపరీత్యం? అంతఃపురాచారాలకు విరుద్ధంగా యీ వేషాన్ని ధరించడానికి హేతువేమిటి?" అని రుద్ధకంఠంతో అడిగేడు.

మహామాయ నిర్వికారమైన వదనంతో తన స్వప్న వృత్తాంతాన్ని అతనికి తెలియజేసి "దేవి ఆజ్ఞ అయింది!... సన్యాసినిని కాకుండా మరోవిధంగా మీతో గల సంబంధాన్ని నేను త్రెంచుకోలేను. ఈ రాజవంశపు మర్యాదను కాపాడుకోడానికి యింతకంటే ఉత్తమమైన మార్గమింకొకటేదీ నాకగుపించలేదు." అంది మహామాయ.

గృహవర్మ కొంతసేపు తీవ్రంగా ఆలోచించి "దేవీ!... ఏదో క్షుద్రమైన వశీకరణ ప్రయోగం నీపై జరుగుతున్నట్లు నా కనుమానంగా ఉంది. నీవంగీకరించినట్లయితే నీ విశ్వాసపాత్రుడైన యీ వాభ్రవ్యుడిని వెంటబెట్టుకొని స్వయముగా ధూమ్రగిరి వెళ్ళి యదార్థమును తెలుసుకొని వస్తాను" అని అన్నాడు.

మహామాయ అధర పుటాలపై శుష్కమైన చిరునవ్వు మెరసింది!... "అలాగే కానివ్వండి" అందామె.

* ♦ ♦ ♦ *

అది వింధ్యారణ్యం!

ఆ అరణ్య మధ్యంలో ఎఱ్ఱని చట్టాళ్ళతో నిండివున్న ఒక కొండ అది!... అదే ధూమ్రగిరి!... ఆ కొండ పై భాగంలో మాత్రం చెట్లు వున్నాయి.

ఒక బ్రహ్మాండమైన ఎఱ్ఱని నిప్పు ముద్దపై నల్లని పొగ వ్యాపించిందా అన్నట్లు ఆ చెట్లగుపిస్తున్నాయి!

ఆ కొండపై కెక్కడానికి ఒక మెట్ల దారి వుంది. ఆ దారిలో అక్కడక్కడా బండ రాళ్ళపై యోగినుల ప్రతిమలు, చిత్రమైన తాంత్రికుల యంత్రాలు చెక్కబడి ఉన్నాయి.

కొండమీద నిర్మలమైన సరోవరమొకటుంది. ఆ సరోవరానికి ఒకవైపున ధూమ్రేశ్వరీ దేవాలయం, మరొకవైపున కొన్ని గుహలు ఉన్నాయి.

గృహావర్మ, వాభ్రవ్యులు ఆలయాన్ని సమీపించేరు. ఆ ఆలయం ద్వారంవద్ద మహా తేజోవంతుడైన ఓ యోగీశ్వరుడు వాళ్ళ కగుపించేడు.

ఆ యోగీశ్వరుడు కాషాయ వస్త్రాలు ధరించి ఒక చేత మెలికలు తిరిగివున్న కర్ర నొకదానిని పట్టుకొని వున్నాడు. గృహావర్మకేసి తీక్షణంగా చూస్తూ వికటాట్టహాసముచేస్తూ తన చేతిలోవున్న కఱ్ఱను గృహావర్మ శిరస్సుకు గురిచేసి విసిరాడు! ... వాభ్రవ్యుడు అడ్డుపడడంచేత ఆ కర్ర రాజుగారి శిరస్సుకు తగలలేదు.

ఆ యోగీశ్వరుడు గంభీరమైన కంఠ స్వరముతో "గృహావర్మా! ... దురదృష్టదేవత నీ నెత్తిమీద తిష్టవేసుకొనుంది! అది నాకు స్పష్టంగా అగుపిస్తున్నది. దాన్ని తొలగించడానికి నేను విసిరిన మహా మహిమాన్వితమైన దండాన్ని

అడ్డుకోని మూర్ఖుడైన యీ కంచుకి అనర్థాన్ని గావించేడు. మౌఖరీ వంశానికి అశుభ సమయం ఆసన్నమయింది." అని అన్నాడు.

గృహవర్మ ముఖం కాంతివిహీనమయింది. విపరీతమైన భీతితో యోగీశ్వరుడికి నమస్కరించి "స్వామీ! ఈ అశుభం తొలగిపోయే మార్గాన్ని తెలియజేసి మౌఖరీ వంశాన్ని కాపాడండి!" అని ప్రార్థించేడు.

యోగీశ్వరుడి ముఖం వికసించింది!

"గృహవర్మా! ... మొదటినుంచీ నిన్ను నువ్వే మోసగించుకుంటున్నావు. మహామాయను విడనాడడానికి నువ్విష్టపడలేదు. పోనీ ఆమెను గ్రహించడానికైనా నువ్వు తగిన ప్రయత్నం చేశావాఅంటే అదీలేదు. అటువంటి నువ్వు యిక్కడేదో వశీకరణ తంత్రం జరుగుతున్నదని భావించి చూడడానికొచ్చేవు కదూ? ... వశీకరణము అంటే ఏవిటో తెలుసా? తనను తాను సంపూర్ణంగా సమర్పించుకోడమే వశీకరణం! ... [redacted] నిన్ను నువ్వు నిశ్శేషంగా సమర్పించుకోలేదు. పోనీ మహామాయను నిశ్శేషంగా గ్రహించడానికి ప్రయత్నించావాఅంటే అదీలేదు!... ఆలయంలోకి పద; వశీకరణ తంత్రం ఎలా జరుగుతున్నదో చూద్దువుగాని!" అన్నాడు.

గృహవర్మ, వాభ్రవ్యులు విభ్రాంతులై లోనికెళ్ళేరు. దశ భుజములు కలిగివున్న విగ్రహమొకటి వాళ్ళకు అగుపించింది. ఆ విగ్రహాని కెదుట అస్థిపంజర తుల్యమైన భక్తు

దొరకడు వాళ్ళ కగుపించేడు. అతడు యెన్నో సంవత్సరాల నుండి సర్వ భోగాలను విసర్జించి దేవిని ధ్యానించడంలోనే నిమగ్నుడై యున్నట్లు గ్రహించాడు.

యోగీశ్వరుడు గృహావర్మ వేపు చూస్తూ "చూసేవా! వశీకరణ తంత్రం ఎలా జరుగుతున్నదో? ... త్రిభువన మోహిని అయిన మాయ ఏ రూపంలో ఈ యువక తపస్విని ఆకర్షించినదో అదే రూపాన్ని ఆరాధిస్తున్నాడు. త్వరలోనే సిద్ధిని పొందుతాడు!... ఇక దేవీ విగ్రహం వేపు చూడు!" అన్నాడు.

గృహావర్మ దేవీ విగ్రహం వేపు చూసేడు.

అది అతనికి మహారాణీ మహామాయలాగ అగుపించింది.

నిర్ఘాంతపోయేడు గృహావర్మ! ...

నిశ్చల నిరీహ నీరస నిర్నిమేష నేత్రాలతో చూస్తున్న గృహావర్మ వీపు తట్టి "ఏంవిటయ్యా అలా నిర్ఘాంతపోయి దేవి ముఖం కేసి చూస్తున్నావు? ... దేవికి నమస్కరించు ... నీ అమంగళాలన్నీ ప్రతిహతమవుతాయి!" అని ఆజ్ఞాపించేడు యోగీశ్వరుడు.

గృహావర్మ శరీరము చెమటతో తడిసిపోయింది. తన అర్ధాంగి అయిన మహామాయ రూపంలోఅగుపిస్తున్న ఆ విగ్రహానికి ఎలా నమస్కరించడం? ...

"ఛీ! ఛీ!"అని భయంకరముగా ఛీత్కారం గావించి స్మృతివిహీనుడై నేలకొరిగిపోయాడు.

వాభ్రవ్యుడు విపరీతమైన ఆందోళనతో అయ్యో!... అయ్యో!" అని అరవసాగేడు. ఆ కేకలకు ఆ యువకునియొక్క తపస్సునకు అంతరాయం కల్గింది. కళ్లు తెరచేడు.

అప్పుడు ఆ యోగీశ్వరుడా యువక తపస్వితో "వత్సా! ఇతనే గృహావర్మ మహారాజు. వశీకరణ తంత్రాన్ని చూడడానికి వాభ్రివ్యుడిని వెంటబెట్టుకొని వచ్చేడు." అని తెలియజేసేడు.

ఆ సంగతి తెలిసిన వెంటనే ఆ దుర్బల యువక తపస్వి నేత్రాలలో ఒక పవిత్రమైన ప్రేమ భావ ముదయించి స్మృతి విహీనుడై పడియున్న గృహావర్మమీదికి ప్రసరించింది.

అటుపిమ్మట ఆ యోగీశ్వరుడు వాభ్రవ్యుని సహాయముతో గృహావర్మను సరోవరంవద్దకు గొంపోయి ముఖంపై నీళ్ళు జల్లి కొంత ఉపచారం చేశాడు. గృహావర్మకు తెలివొచ్చింది. అతను లేచి కూర్చున్నాక "మహారాజా! ... నీవు త్రిపురసుందరీ దేవిని మహామాయ రూపంలో చూశావు! ... మహామాయను త్రిపురసుందరీ దేవి రూపములో చూచివున్నట్లయితే బాగుండిపోయేది! ... మౌఖరీ రాజ్యలక్ష్మి యికయెంతో కాలం నిలువదు. నీవు మహామాయను విడిచిపెట్టి రెండో వివాహం చేసుకో. అందువల్ల నీ అనంతరం నీ వంశానికి మేలు చేకూరుతుంది. మ్లేచ్ఛుల దండయాత్ర ప్రారంభమయ్యే సమయం దగ్గరపడింది. అయితే మహామాయ యీ విపత్తునుండి ఆర్యావర్తాన్ని కొంతవరకూ ఉద్ధరించగలదు.

ఆమెను నువ్వు అడ్డగించకు ఇక వెళ్ళు." అని చెప్పి యోగీశ్వరుడు వెళ్ళిపోయేడు.

మహారాజు స్తబ్ధుడై అంతా విన్నాడు,

గంభీరమైన మౌనాన్ని దాల్చి నగరానికి చేరుకున్నాడు. తాను ధూమ్రేశ్వరీ ఆలయంలో పొందిన అనుభూతి అంతా వశీకరణానికి సంబంధించిన ఒక అభిచారంగా భావించేడు ! ... మహామాయను విడిచిపెట్టడానికి ఆతని మనస్సు ఒప్పుకోలేదు.

వాభ్రవ్యునిద్వారా ధూమ్రగిరి విశేషాలన్నింటినీ మహామాయ వివరంగా తెలుసుకుంది.

ఇక తన కర్తవ్యమేమిటి ? ... మహామాయ బాగా ఆలోచించి తిరుగులేని నిశ్చయానికొచ్చింది.

కంచుకిని పిలిచి "మహారాజావారు మోహాబద్ధులైయుండడంచేత సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నారు !... నేను ధూమ్రగిరికి వెళ్ళ నిశ్చయించుకున్నాను. నన్ను పోనియ్యి !" అని వేడుకుంది మహామాయ.

వృద్ధ కంచుకి వాభ్రవ్యుడు అడ్డుచెప్పలేదు.

మహామాయ అంతఃపురమునుండి బయటపడింది.

* ♦ ♦ ♦ *

కొన్నాళ్ళ తర్వాత మౌఖరీ వంశపు శ్రేయోభిలాషుల బలవంతంపై శ్రీహర్షవర్ధనుడి సోదరి అయిన రాజ్యశ్రీని గృహవర్మ వివాహం చేసుకున్నాడు.

రాజ్యశ్రీకి అనతికాలంలోనే వైధవ్యం సంప్రాప్తించింది. మాళవులు, గౌడులు కలిసి గృహవర్మను చంపి కన్యాకుబ్జమును ఆక్రమించారు.

ఈ ఘోర సంఘటన హర్షవర్ధనుడిలోని వీరత్వాన్ని రెచ్చగొట్టింది. మాళవులను, గౌడులను అణచివేసి తిరిగి కన్యాకుబ్జ దేశాన్ని ఆక్రమించి స్థానేశ్వర రాజ్యంతో కలిపేడు.

రాజ్యశ్రీ మహారాణికి భర్త తరఫు బంధువులైన కొంతమంది చిన్న రాజులు విషయలోలురై అందమైన కన్యల నపహరిస్తూ వారి ఆక్రందనాలచే అంతఃపురాలను కలుషితం చేస్తున్నారన్న సంగతి మహామాయకు తెలుసు! ... శ్రీహర్షవర్ధన మహారాజు మౌఖరీ రాజవంశీయులపట్ల ప్రజలలో ఇంకా గౌరవభావమున్నదనే విషయాన్ని గమనించి అవినీతిపరులు, భోగలాలసులూ అయిన గృహవర్మ బంధువులపట్ల క్షమాగుణాన్ని ప్రదర్శిస్తూండడం మహామాయ కిష్టం లేదు. అటువంటి వారికి తగిన విధంగా బుద్ధిగరపాలని ఆమె ఉద్దేశ్యం! ... అటువంటి భోగలాలసులవల్ల దేశానికి అరిష్టం చేకూరుతుందని ఆమె అభిప్రాయం! ... అందుచేతే ఆనాడామె అంత ఆవేశపరురాలై ఉపన్యసించింది.

అవధూతస్వాములైన అఘోరభైరవులు ఎవరో కాదు! అతడే త్రిపురసుందరీదేవిని సాక్షాత్కరింపజేసుకున్న యువక తపస్వి! ... గృహవర్మతో వివాహం కాకమునుపు మహా

మాయ ఏ యువకుడిని వివాహంచేసుకోవాలని మధుర స్వప్నాలను కందో అతనే అఘోర భైరవులు!

అయితే యిప్పుడా ఉభయులకూ ఉన్న సంబంధము పరమ పవిత్రమైనట్టిది. అఘోర భైరవులకు మహామాయ ప్రియమైన శిష్యురాలు. ఆ పవిత్రమైన సంబంధం యిక యెన్నటికీ కలుషితంకాదు.

అఘోరభైరవులవారి ఆజ్ఞానుసారం ఆర్యావర్తాన్ని కాపాడేటందుకై మహామాయ లక్షలాది యువకులను ఉత్తేజపరిచింది. ఆ యువకులందరికీ సైనిక శిక్షణ ఒసంగబడింది. భారతీయుల సైనిక శక్తి, తమ సైనిక శక్తికి మించి వున్నదనే సంగతి శత్రువులు గుర్తించేరు కాబోలు! ... వెనక్కు తగ్గేరు. శాంతి ఘాతకులైన ఆ దుర్మార్గులు భారతదేశంపై చేయసంకల్పించిన ఆ దాడి తాత్కాలికంగా విరమించబడిందే కాని శాశ్వతంగా విరమించబడలేదని, అందుచేత సర్వదా అప్రమత్తులై యుండమని భారత వీరులను హెచ్చరించింది మహామాయ.

— సమాప్తం —

జాగృతి - 15-11-1963

["బాణభట్టుని స్వీయ చరిత్ర" ఈ కథానికకు ఆధారం]

★